క్లుప్తంగా

నేత్ర దానం


సుశీల (ఫైల్)

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరుకు చెందిన గుమ్మడి సుశీల(84) మృతి చెందారు. ఆమె కోరిక మేరకు తన కుమారుడు గుమ్మడి రామకృష్ణ అనుమతితో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఆమె భౌతిక ఖాయం నుంచి ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ వైద్యులు నేత్రాలను సేకరించారు. వీటిని ఆపదలో ఉన్న వారికి అమర్చేందుకు భద్రపరుస్తారని లయన్స్ చైర్మన్ శశికళ తెలిపారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

మండవల్లి: మండలంలోని కానుకొల్లు గ్రామ సచివాలయంలో ఉపాధిహామీ పనులపై శుక్రవారం గ్రామసభ సర్పంచ్ నాగదాసి థామస్ అధ్యక్షతన నిర్వహించారు. చేపట్టబోయే పనులను వివరించారు. గ్రామ కార్యదర్శి ఎం కొండలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో పేదలకు శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్ కాకాని ఆదిలక్ష్మి జయంతిని పురస్కరించుకుని ఆమె భర్త జగన్మోహనరావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, క్లబ్ కార్యదర్శి ఎం.పెరుమాళ్లు పాల్గొన్నారు.

అమరజీవిని ఆదమరిచారు



గుడ్లవల్లేరు: ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములును ఆదమరిచారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా శుక్రవారం గుడ్లవల్లేరు వార్పురోడ్డులోని వాసవీ టవర్స్‌లో అమరజీవి విగ్రహాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

గోశాలకు దాణా వితరణ



గుడివాడ టౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో స్థానిక దనియాలపేటలోని శ్రీ ప్రణవాశ్రమంలోని గాయత్రి గోశాలకు దాణా వితరణగా ఇచ్చారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు మనోజ్ కుమార్ జైన్ కుటుంబ సభ్యుల వితరణతో రూ.10 వేలు విలువ గల దాణా కట్టలు అందజేసినట్లు ప్రణవాశ్రమ మేనేజర్ వేణుబాబు తెలిపారు. లయన్స్‌క్లబ్ ప్రగతి అధ్యక్షుడు ఎస్. శేషగిరిరావు, వై. వీరేంద్రనాథ్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ఎన్నో రకాల యాప్‌లు



గుడ్లవల్లేరు: మహిళల భద్రత కోసం ఎన్నో రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయని హైదరాబాదు డాక్టర్ రెడ్డీ ల్యాబొరేటరీస్ ఎనలైటికల్ సైంటిస్ట్ ఇ.రామేశ్వరి అన్నారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కళాశాల్లో శుక్రవారం నిర్వహించిన ఉమెన్ సేఫ్టీ, ఎనర్జీ ఎంబాసిడర్ అనే అంశంపై జీవన నైపుణ్య కార్యక్రమానికి రామేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మహిళల భద్రత కోసం ఉన్న యాప్‌లను ఉపయోగించుకోవాలన్నారు. సామాజిక నేరాలను అరికట్టేందుకు మహిళలు మనో ధైర్యంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమెను కాలేజీ ప్రతినిధులు సన్మానించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ టి.బాలకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కే అమినాబీ, డాక్టర్ పి.రవీష, బి.సత్యశ్రీ పాల్గొన్నారు.

రూ.10 నాణేలు చెల్లుతాయి

మండవల్లి: రూ.10 నాణేలు చెల్లుతాయని, తప్పనిసరిగా తీసుకోవాలని ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు, కోశాధికారి బందారు వెంకయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఇండియన్ బ్యాంక్, కృష్ణా కో–ఆపరేటివ్ బ్యాంకుల వద్ద వారు మాట్లాడారు. బ్యాంకులతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఇచ్చిన పిలుపు మేరకు ఐక్య వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించామన్నారు. రిజర్వు బ్యాంకు ఆదేశాలను అనుసరించి రూ.10 నాణేలను తప్పనిసరిగా ప్రతిఒక్కరూ తీసుకోవాలని కోరారు.

శిథిలావస్థలో పోలుకొండ రెగ్యులేటర్

ఆందోళనలో ప్రజలు, రైతులు

వేలాది ఎకరాలకు సాగునీరు, మూడు మండలాల్లోని గ్రామాలకు వెళ్లేందుకు పోలుకొండ వద్ద చంద్రయ్య డ్రెయిన్‌పై ఏడు దశాబ్దాల క్రితం నిర్మించిన రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరింది. రెగ్యులేటర్ షట్టర్లు కూడా కూలపోయే విధంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పరిసర గ్రామాల రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


శిథిలావస్థలో ఉన్న పోలుకొండ రెగ్యులేటర్

గుడివాడరూరల్: నందివాడ, మండవల్లి, గుడివాడరూరల్ మండలాల్లోని పదుల సంఖ్యలో గ్రామాలకు చంద్రయ్య కాలువ మురుగు నీరుతో పాటు సాగునీటికి ఉపయోగపడుతుంది. ఈ డ్రెయిన్‌పై నీటిని నిల్వ చేసే సౌకర్యం లేకపోవడంతో నీరు వృథాగా కొల్లేరులోకి పోయేది. సమస్యను గ్రహించిన పోలుకొండ మాజీ సర్పంచ్ పర్వతనేని బసవ శంకరరావు ఏడు దశాబ్దాల క్రితమే పోలుకొండ వద్ద చంద్రయ్య డ్రెయిన్‌పై రెగ్యులేటర్ నిర్మాణానికి పూనుకున్నారు. రైతుల విరాళాలు, ప్రభుత్వ సహకారం, తన సొంత నిధులు కలిపి రెగ్యులేటర్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీని వలన మండవల్లి, ఇతర ప్రాంతాలకు రోడ్డు సౌకర్యంతో పాటు మూడు మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. రెగ్యులేటర్ వద్ద అవసరమైనప్పుడు నీటిని నిల్వ చేసి గ్రామాల్లోని పంట పొలాలు, చేపల చెరువులకు అందిస్తున్నారు. గత కొంతకాలంగా రెగ్యులేటర్ శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధమైంది. రెగ్యులేటర్ ప్రధాన షెట్టర్ ధ్వంసమై పని చేయకపోవడంతో డ్రెయిన్‌కు వస్తున్న నీరు వృథాగా దిగువకు పోతోంది.

షట్టర్‌కు తాత్కాలిక మరమ్మతులు

అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రముఖ ఆక్వా రైతు ముదునూరు లింగరాజు ఆధ్వర్యంలో ఆక్వా రైతులు షట్టర్‌కు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి నీరు వెళ్లకుండా నిలుపుదల చేశారు. అధికారులు మాత్రం షెట్టర్ల పర్యవేక్షణను గాలికి వదిలేశారు. కొన్ని సంవత్సరాలుగా రెగ్యులేటర్ మరమ్మతులు నిర్వహించిన దాఖలాలు లేవు. రెగ్యులేటర్ గోడలు సైతం బీటలువారడంతో రోడ్డు శిథిలమై ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రెగ్యులేటర్ సమీపంలోనే మరో వంతెన నిర్మించినా అది కూడా ఇప్పటికే శిథిలం కావడంతో పాత రెగ్యులేటర్ వంతెనే గ్రామాల ప్రజలకు దిక్కుగా మారింది. దీనికి తోడు రెగ్యులేటర్ దిగువన ఉన్న భూములకు నీరు అందించేందుకు డ్రెయిన్ కుడి, ఎడమ నిర్మించిన కాల్వల షట్టర్లు ధ్వంసమయ్యాయి. ఏడు కిలో మీటర్ల మేర ఉన్న కాల్వలను సైతం కొందరు రైతులు ఆక్రమించి చేపల చెరువుల్లో కలిపేసుకున్నారు.

కన్నెత్తి చూడని అధికారులు

మూడు మండలాల్లోని పంట భూములు, చేపల చెరువులతో పాటు రవాణా సౌకర్యం కలిగి ఉన్న రెగ్యులేటర్ శిథిలమవుతున్నా సంబంధిత ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. షట్టర్ల నిర్వహణకు ఏర్పాటు చేసిన లస్కర్ గ్రామానికి వచ్చిన దాఖలాలు లేవు. లస్కర్ ప్రైవేట్ వ్యక్తులు రెగ్యులేటర్ షట్టర్ల పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. పాలకులు, అధికారులు సైతం రెగ్యులేటర్ నిర్వహణను గాలికి వదిలేయడంతో షట్టర్లు శిథిలమై భారీ ప్రవాహం వచ్చినప్పుడు కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని రెగ్యులేటర్‌కు మరమ్మతులు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.


పని చేయని ప్రధాన రెగ్యులేటర్ షట్టర్

అధికారుల నిర్లక్ష్యం



రెగ్యులేటర్ షట్టర్లు శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదు. షట్టర్ల మరమ్మతులను ఎప్పటికప్పుడు నిర్వహించాలి. నీటి ప్రవాహం అధికంగా వచ్చినప్పుడు పర్యవేక్షణ జాగ్రత్తగా చేయాలి. రెగ్యులేటర్‌ను అధికారులు గాలికి వదిలేశారు. ప్రైవేట్ వ్యక్తులతో రెగ్యులేటర్ నిర్వహిస్తున్నారు. రెగ్యులేటర్ శిథిలావస్థకు అధికారుల నిర్లక్ష్యమే కారణం.

– బాబ్జీ, రైతు, తమిరిశ

సాగునీరు ప్రశ్నార్థకం



ఏడు దశాబ్దాల క్రితం మూడు మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందేందుకు, మురుగునీరు పోయేందుకు ఏర్పాటు చేసిన రెగ్యులేటర్ శిథిలమైతే సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారుతుంది. మురుగునీరు వెళ్లే అవకాశం లేక గ్రామాలు ముంపుబారిన పడతాయి. పదుల సంఖ్యలో గ్రామాలకు రోడ్డుమార్గం లేకుండా పోతుంది. అధికారులు, పాలకులు వెంటనే షట్టర్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలి.

– నాగరాజు, ఎల్ఎస్‌పురం గ్రామస్తుడు

పింఛనుదారుల పడిగాపులు



గుడ్లవల్లేరు: మండలంలోని పలుచోట్ల సమయానికి ప్రభుత్వం నుంచి పింఛన్లు అందకపోవడంతో లబ్ధిదారులు పడిగాపులు పడ్డారు. పెంజెంద్ర, గుడ్లవల్లేరులో శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సర్వర్ మొరాయించింది. దీనితో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్లు అందకపోవటంతో పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులుకాశారు.

సాంకేతిక లోపం

మండవల్లి: సాంకేతిక లోపంతో మండలంలో పింఛన్ల పంపిణీ మూడు గంటల సేపు నిలిచిపోయింది. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 వరకు యాప్ పనిచేయకపోవడంతో పింఛన్ల పంపిణీ నిలిచిపోయింది. దీంతో లబ్దిదారులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. తిరిగి యాప్ పనిచేయడంతో, అనంతరం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సర్వర్ల మొరాయింపు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలో శుక్రవారం వేకువజాము నుంచి ప్రారంభమైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీకి సర్వర్ మొరాయించడంతో బ్రేక్ పడింది. ప్రభుత్వ సిబ్బంది ఉదయం ఐదు గంటల నుంచి నగదు ఇవ్వటం ప్రారంభించారు ఉదయం ఏడు గంటలు దాటిన తర్వాత సర్వర్ సేవలు నిలిచిపోవడంతో పంపిణీ దారులు, లబ్దిదారులు గంటల తరబడి పడిగాపులుగాచారు. ఎంతకీ పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఇంటికి రాక పోవటంతో వృద్ధులు, వికలాంగులు పంచాయతీ కార్యాలయాల బాట పట్టారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత సర్వర్ కనక్ట్ అవ్వటంతో పింఛన్ల పంపిణీ ఊపందుకుంది. సాయంత్రం 5 గంటల వరకు మండల పరిధిలోని 8,579 మందికి గాను 8,151 పింఛన్‌లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ విమాదేవి తెలిపారు.

భైరవపట్నంలో బరితెగింపు

కూటమి నేతల అండతో కోడిపందేలు


భైరవపట్నంలో కోడిపందేల బరుల వద్ద సిద్ధంగా ఉంచిన పుంజులు

మండవల్లి/కైకలూరు: అది పామర్రు – దిగమర్రు జాతీయ రహదారి. మండవల్లి మండలం భైరవపట్నం గ్రామం. దీపావళి పర్వదినం కావడంతో కూటమి నేతల అండతో బహిరంగంగా కోడిపందేలు నిర్వహించారు. దాదాపు 2,000 మందితో సంక్రాంతి కోడిపందేలను తలపించేలా కోడిపందాలు భైరవపట్నంలో జరిపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఈ గ్రామంలో ఇరువురు నాయకులు బరితెగించారు. రోజూ పేకాట శిబిరం, ప్రతి ఆదివారం, పండగలకు కోడిపందేలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. పేకాట ఆడాలంటే నిర్వాహకులకు రూ.1,000 కప్పం కట్టాల్సిందే. కోడిపందేలైతే ఒక్కో పందేనికి కమిషన్ తీసుకుంటున్నారు. భైరవపట్నంలో సదరు కూటమి నేతలకు ప్రత్యేకంగా ఒక గ్రౌండ్ ఉంది. దీనికి పెద్ద గేట్లు పెట్టారు. లోపల ఎవరైన గొడవ చేస్తే దాడి చేయించడానికి కొందరు యువకులను సిద్ధంగా ఉంచుతున్నారు. దీపావళి రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు విచ్చలవిడిగా కోడిపందేలు నిర్వహించారు. వందలాది ద్విచక్రవాహనాలు జాతీయ రహదారి పక్కనే ఉన్నాయి. ఎదురుగా టెంట్లు వేసి పెద్ద కోలాహలం. పైగా కావాల్సిన బ్రాండ్లతో అందుబాటులో మద్యం లభిస్తోంది. ఇంత జరుగుతున్నా.. ఇదే దారిలో తిరుగుతున్న పోలీసుల కంటపడలేదు. జిల్లా పోలీసు అధికారులకు కోడిపందేల వీడియోలు వెళ్లడం, సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు రావడంతో పోలీసులు కదిలారు. అప్పటికే సమాచారం నిర్వాహకులకు వెళ్లడంతో సాయంత్రం జూదరులు పరారయ్యారు. మండవల్లి పోలీసులు చివరకు కేవలం నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, రూ.5,200, పందెం కోడి ఒకటి, ఒక కత్తి స్వాధీనం చేసుకుని మమ అనిపించారు. కూటమి నేతల బెదిరింపులకు పోలీసులు సైతం తలలు పట్టుకుంటున్నారు.

విద్యుత్ చార్జీలు పెంచే నిర్ణయం వెనక్కు తీసుకోవాలి



గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచుతూ తీసుకున్న నిర్ణయం వెనక్కు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టి. తాతయ్య అన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. గత ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచబోము, విద్యుత్ ఉత్పాదన పెంచి చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి గెలిచిన చంద్రబాబు కూటమి నాయకులు ఇప్పుడు మాట తప్పారన్నారు. ప్రజలపై చార్జీల పేరుతో మళ్లీ భారం మోపుతున్నారన్నారు. సీపీఐ నాయకులు సీహెచ్. సత్యనారాయణ, డి.వెంకటనరసింహరావు, పి.శేషు, పి.రంగారావు, బాపణయ్య, గిరి పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల నడుమ దీపావళి


తాడంకిలో టపాసులు కాల్చుతున్న చిన్నారులు


గుడివాడలోని టపాసుల షాపులో వినియోగదారుల సందడి

గుడ్లవల్లేరు: కోటి కాంతుల్లో దీపావళి పండగను అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించి పిండి వంటలను చేశారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు టపాసులను కాల్చేందుకు ఆసక్తి కనబరిచారు. పిల్లలు టపాసులు కాలుస్తుంటే వారి కళ్లల్లో కాంతుల్ని చూసి తల్లిదండ్రులు ముచ్చట పడ్డారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: దీపావళి పర్వదినాన్ని గుడివాడ నియోజకవర్గంలోని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు ప్రమిదల్లో ఏర్పాటు చేసిన దీపాలు వెలిగించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. కాగా నిబంధనల ప్రకారం ప్రతి కొనుగోలుకు రసీదులు ఇవ్వాల్సి ఉండగా అదేమి లేకుండా టపాసులను అధిక ధరలకు విక్రయించారు. అడ్డుకోవాల్సిన అధికారులు వ్యాపారుల ఆమ్యామ్యాలకు తలొగ్గి చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలో వాడవాడలా దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. లక్ష్మీదేవికి పూజలు చేశారు. ఇంటింటా దీపపు కాంతులు వెల్లివిరిసాయి. చిన్నారులు టపాసులు కాల్చుతూ సందడి చేశారు.

పామర్రులో..

పామర్రు: మండలంలో దీపావళి పండుగను చిన్నలు పెద్దలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. లక్ష్మీదేవికి విశేషంగా పూజలు చేసి రకరకాల పిండివంటలను ఆ దేవికి నివేదనగా సమర్పించారు. సాయంత్రం ఇళ్ల ముందు దీపాలను వరుసలో వెలిగించి, టపాసులను చిన్నారులు పెద్దల సమక్షంలో కాల్చి ఆనందంగా గడిపారు.

సంక్షిప్త వార్తలు

■ నేటి నుంచి నిత్యాన్నదానం

ముదినేపల్లి రూరల్ : వివిధ మాలధారులకు మండలంలోని శ్రీహరిపురం షిర్డీసాయిబాబా ఆలయం వద్ద కార్తికమాసం సందర్భంగా శనివారం నుంచి నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు నీలం వెంకట నాగమల్లేశ్వరరావు తెలిపారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

■ ధాన్యం సేకరణపై అవగాహన

పమిడిముక్కల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీఏసీఎస్ సిబ్బందికి ధాన్యం సేకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సివిల్ సప్లయిస్ టీఏలు సుభాషిణి, శారద ధాన్యం సేకరణ, ప్రమాణాల నిర్ధారణ, యాప్‌లపై వ్యవసాయ సహాయకులు, పీఏసీఎస్ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. సాధారణ రకం కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,300, 75 కేజీలకు రూ.1,725 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. గ్రేడ్ ఏ రకంకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,320లు, 75 కేజీలకు రూ.1,740 చెల్లిస్తారన్నారు. తేమ లేక నిమ్ము 17 శాతం లోపు ఉండాలని పేర్కొన్నారు.

■ ప్రజా సంక్షేమమే ధ్యేయం

పామర్రు: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని కొండిపర్రు గ్రామ టీడీపీ అధ్యక్షుడు నూకారపు వీరాంజనేయులు రాజా అన్నారు. శుక్రవారం కొండిపర్రు గ్రామంలో లబ్ధిదారులను పెన్షన్లను పంపిణీ చేశారు. పసుపులేటి విజయ్‌కుమార్, సత్యనారాయణ, చిరంజీవి, సువర్ణ రాజు ముదునూరి, వీఆర్వో బేబి సరోజిని పాల్గొన్నారు.

■ ఘనంగా తేరు ప్రదక్షిణ

ముదినేపల్లి రూరల్ : ముదినేపల్లిలో తేరు ప్రదక్షిణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. అక్టోబరు మాసాన్ని జపమాల మాసంగా క్రైస్తవులు ఆరాధిస్తారు. జపమాల మాసం ముగింపు సందర్భంగా ముదినేపల్లిలో గురువారం మరియతల్లి స్వరూపంతో తేరు ప్రదక్షిణ నిర్వహించారు.

■ 95.7 శాతం పింఛన్ల పంపిణీ

గుడివాడరూరల్: మండలంలో 95.7 శాతం పంపిణీ పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ విష్ణు ప్రసాద్ శుక్రవారం తెలిపారు. మండలంలో మొత్తం 5,346 పెన్షలు ఉండగా మొదటి రోజే 5,116 మందికి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

■ కల్యాణమస్తు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎలకుర్రు(పామర్రు): కృష్ణామిల్క్ యూనియన్ అందజేస్తున్న కల్యాణమస్తు పథకాన్ని పాల ఉత్పత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఎలకుర్రులోని పాల సేకరణ కేంద్రంలో పాలు పోసిన మట్టా నాగరాజు కుమార్తు వివాహం సందర్భంగా శుక్రవారం గోల్డు కాయిన్‌ను అందజేశారు. పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ సీహెచ్ గోపీనాథ్, సంఘ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

■ అమరజీవికి నివాళి



మొవ్వ: మొవ్వ గ్రామంలోని ప్రధాన కూడలిలో శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ నంబూరి జగదీష్ కృష్ణ, మొవ్వ వర్తక సంఘం ప్రెసిడెంట్ రమేష్, మొవ్వ మండల ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు పాల్గొన్నారు.

■ విజయ్ భాస్కర్‌కు సత్కారం



గుడివాడ టౌన్: అబ్దుల్‌కలాం జాతీయ అవార్డు గ్రహీత బొప్పన వెంకట విజయ్ భాస్కర్‌ను పోస్టల్ శాఖ అధికారులు శుక్రవారం సత్కరించారు. స్థానిక విద్యాలయ పాఠశాలలో జరిగిన అభినందన సభలో పోస్టల్ సూపరింటెండెంట్ చల్లా అప్పారావు జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు.

■ శంకర అశ్వార్ దాస్‌కు ఘన నివాళి

గుడివాడ టౌన్: వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు శంకర్ అశ్వార్ దాస్ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షుడు శివరామకృష్ణ, కార్యదర్శి రామారావు, కోశాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

■ 6న మండల పరిషత్ సమావేశం

పామర్రు: పామర్రు మండల పరిషత్‌సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె జ్యోతి శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు దాసరి అశోక్‌కుమార్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు.

■ హెచ్ఐవీపై అప్రమత్తం

ముదినేపల్లి రూరల్: హెచ్ఐవీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని చైల్డ్‌ఫర్ లింక్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధి జె.నాగలక్ష్మి సూచించారు. మండలంలోని బొమ్మినంపాడులో హెచ్ఐవీపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. హెచ్ఐవీ సోకిన వారి పట్ల వివక్ష చూపరాదని ఆమె పేర్కొన్నారు.

■ నేడు హుండీ కానుకల లెక్కింపు

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో తనిఖీ అధికారులు, దేవదాయ, ధర్మాదాయ శాఖ గుడివాడ అధికారుల సమక్షంలో ఉదయం 10 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

■ డ్రెయిన్లు, రోడ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు

గుడివాడరూరల్: గుడివాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సమస్యలతో సతమతమవుతున్న కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

■ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మండల ప్రాథమిక పాఠశాల వద్ద నుంచి బాదిన వెంకన్నబాబు ఇంటి వరకు రూ.6 లక్షలతో 60 మీటర్ల రోడ్డు నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. పెరుమాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

■ రేపు ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ కన్వీనర్ సి. సూర్య చంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ధరలు ఢాం.. టపాసులు తుస్

రెట్టింపు ధరలతో కొనుగోలుదారుల జేబుకు చిల్లు


గుడ్లవల్లేరులోని దుకాణాల్లో టపాసులను విక్రయిస్తున్న దృశ్యం

గుడ్లవల్లేరు: టపాసుల దుకాణదారులు రెట్టింపు ధరలతో విక్రయించి కొనుగోలుదారులకు జేబుకు చిల్లు పడేశారు. గుడ్లవల్లేరులో టపాసులు దుకాణదారులు ధరలను భారీగా పెంచేసి విక్రయించటంతో పండగ కాస్త తమకు ఆవేదనగా మారిందని బాధితులు వాపోయారు. జీఎస్టీల పేరిట టపాసుల ధరలను అధికంగా గుంజేయటంతో వినియోగదారులు గగ్గోలు పెట్టారు. ఈ అమ్మకాల్లో గతేడాది నిల్వ ఉన్న టపాసులను కూడా కొన్ని దుకాణాల్లో విక్రయించారనే ఆరోపణలు వచ్చాయి. ఆ టపాసులు కాస్త పేలకుండా తుస్‌మన్నాయని ఆరోపించారు. గుడ్లవల్లేరులో నాలుగు టపాసుల దుకాణాలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ దుకాణాల గోదాములను కూడా నివాసాల మధ్యనే ఏర్పాటు చేయటం శోచనీయం. దుకాణాల వద్ద కూడా ఒక చిన్న అగ్ని ప్రమాదం జరిగినా ఎలాంటి నీటి వసతి లేకుండా పోయింది. ఇటీవల గుడివాడ జీవీ మాల్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దానిని దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ స్వయంగా టపాసుల దుకాణాల వద్ద ఎలాంటి అగ్ని ప్రమాదం జరిగినా ఇబ్బంది లేకుండా నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అయితే నిబంధనలకు దుకాణాదారులు నీళ్ల వదిలేశారు. అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో మునిగి చోద్యం చూడటంతో సరిపెట్టుకున్నారని స్థానికులు విమర్శించారు.

■ నేటి నుంచి ఉచిత వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సీఎల్ వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులో శనివారం నుంచి రెండు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రుగ్మతలతో బాధ పడుతున్న రోగులకు కార్పొరేట్ వైద్యం సైతం అందించే విధంగా వైద్య పరీక్షలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

■ జూదరుల అరెస్ట్

మండవల్లి: మండలంలోని అయ్యవారిరద్రవరం గ్రామ శివారులో గురువారం జూదమాడుతున్న ఇరువురు వ్యక్తులను పట్టుకుని, వారి నుంచి రూ.6,420 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. భైరవపట్నంలో కోడిపందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకుని, వారి నుంచి రూ.5,200, ఒక కోడి, కత్తి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.